క్లుప్తంగా

వెల్లాలలో ఘనంగా భీష్మ ఏకాదశి

రాజుపాళెం : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్ర మైన వెల్లాల గ్రామంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం భీష్మ ఏకాదశి సందర్భంగా స్వాములకు ఘనంగా పూజలు చేశారు. ఆలయ అర్చకుడు వెంకటాచలపతి స్వామికి, పార్వతీదేవి, నరసింహ, వీరభద్ర స్వాములను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వాములు, అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అంధులను ఆదరించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : అంధులను ఆదరించాలని త్రీటౌన్ సీఐ నారాయణ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక రాయలసీమ ఫర్నీచర్స్ వద్ద బుధవారం గాజులపల్లె పెద్ద సుబ్బయ్య పెద్ద సుబ్బమ్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో 44 మంది అంధులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధులకు సంస్థ ఆధ్వర్యంలో రూ.200 పింఛన్ ఇవ్వడం అభినందనీయమన్నారు. సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలను కొనియాడారు. ఎస్‌బీఐ ఉద్యోగి వరదరాజులు, పబ్బతి శ్రీరాములు, భక్తపెంచలయ్య అంధులకు ఒక్కొక్కరికి రూ.100 చొప్పున అందచేశారు. సంస్థ అధ్యక్షుడు గాజులపల్లె రామచంద్రుడు, విశ్రాంత ఉద్యోగులు గురప్ప, గోవిందరాజులు, గురివిరెడ్డి, సుబ్బయ్య, రహమాన్, శివశంకర్, సుబ్బరాయుడు, నరసింహులు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నివారణపై అవగాహన

చాపాడు : హెచ్ఐవీ నివారణపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని వైద్యులు హేమేంద్ర సింగ్, సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అనంతపురం గ్రామంలోని ఎయిడ్స్ నియంత్రణ సంస్థ చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం వారి ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. హెచ్ఐవీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. అనంతరం 37 మందికి హెచ్ఐవీ, సుఖ వ్యాధుల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ వర్కర్స్ స్కీం సూపర్‌వైజర్ దర్బార్, వైద్య సిబ్బంది నారాయణరెడ్డి, ఎంపీహెచ్ఓ కీర్తి, ఏఎన్ఎం సుజాత, ఆశా కార్యకర్తలు, సిబ్బంది సేరేంద్ర, అమీర్ పాల్గొన్నారు.

కాశినాయన ఎస్ఐగా హరిప్రసాద్



కాశినాయన : కాశినాయన ఎస్ఐగా హరిప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. పోరుమామిళ్ళ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ప్రవీణ్‌కుమార్ యర్రగుంట్లకు బదిలీపై వెళ్ళారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో బెల్టుషాపు నిర్వహిస్తే కఠిన చర్యలుంటాయని తెలిపారు.

కుష్టువ్యాధిని నిర్మూలిద్దాం

ప్రొద్దుటూరు క్రైం : కుష్టువ్యాధిని నిర్మూలిద్దామని కమ్యూనిటీ కో–ఆర్డినేటర్ నాగజ్యోతి తెలిపారు. కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీనివాసనగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 13 వరకు కుష్టువ్యాధిపై అవగాహన ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. చర్మంపై స్పర్శలేనిరాగి వర్ణం కలిగిన మచ్చలుంటే కుష్టువ్యాధిగా అనుమానించాలన్నారు. అలాగే కనుబొమ్మలు, కనురెప్పలు రాలిపోతున్నా, చేతుల నుంచి వస్తువులు జారిపోయినా, అరిచేతులు, అరికాళ్లలో స్పర్శలేకున్నా కుష్టు అనుమానిత లక్షణాలుగానే భావించాలని ఆమె తెలిపారు. అనుమానిత లక్షణాలుంటే ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన అవసరం

ప్రొద్దుటూరు క్రైం : ప్రతి ఒక్కరూ అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి రఘునాథ్ తెలిపారు. ఇంటర్నేషనల్ డిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు బుధవారం అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించారు. ఇందులో భాగంగా అగ్నిమాపక కేంద్రం, సిబ్బంది విధుల గురించి విద్యార్థులకు అధికారులు వివరించారు. అలాగే ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, మంటలార్పు పద్ధతులను గురించి తెలిపారు. లీడింగ్ ఫైర్‌మెన్‌లు అన్వర్‌బాషా, ఏపీ నరసింహులు, డీఎస్ వెంకటేశ్వర్లు, ఫైర్‌మెన్‌లు, పాఠశాల పీఈటీ విక్రమ్ కుమార్, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

భార్యపై వేధింపులు.. కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : భార్య ఫిర్యాదు మేరకు భర్త మస్తానయ్యపై వేధింపుల కేసు నమోదయ్యింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు డీఎస్సార్ కాలనీకి చెందిన ఉమ్మా సల్మాను ఆమె భర్త మస్తానయ్య డబ్బు కోసం వేధిస్తూ కొట్టేవాడు. దీంతో ఉమ్మా సల్మా బుధవారం టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మస్తానయ్యతో పాటు ఆరుగురు కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రెడ్డిసురేష్ తెలిపారు.

ప్రతి ఇంటికీ శుద్ధి జలం అందించడమే ధ్యేయం

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

దువ్వూరు : ప్రతి ఇంటికీ శుద్ధి జలాన్ని అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కానగూడూరు గ్రామంలో బుధవారం రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి డీఎంఎఫ్ నిధుల నుంచి రూ.6.50 లక్షలతో 1000 లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికీ శుద్ధి జలాన్ని అందిస్తామన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాలు ఎలా అందుతున్నాయని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి, ఇంకా ఎవరికైనా సంక్షేమ పథకాలు అందించాల్సి ఉంటే వారిని త్వరగా గుర్తించి పథకాలను అందించాలని వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. గ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజి కాలువల ఏర్పాటు, కొత్తగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు ప్రజలు విన్నవించారు. వెంటనే ఈ సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, సర్పంచ్ కోట్ల బీబీ, ఎంపీటీసీ కామనూరు సుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కిరణ్‌కుమార్ రెడ్డి, సురేంద్ర, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

రూ.55లక్షలతో అభివృద్ధి పనులు

మైదుకూరు(చాపాడు) : మైదుకూరులో పట్టణంలోని శ్రీ లక్ష్మీ మాధవ రాయ స్వామి ఆలయంలో ఇటీవల రూ.55 లక్షలతో పలు రకాలైన అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం వీటిని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి చేతుల మీదుగా వేద పండితుల ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మైదుకూరు ప్రజల కోరిక మేరకూ ప్రభుత్వం నుంచి మంజూరైన దేవదాయ శాఖ ద్వారా రూ.40లక్షలతో పాటు ఆలయ కమిటీ సంయుక్తంగా రూ.55 లక్షలతో ఆలయానికి ప్రహరీ, చప్టట, ప్రత్యేక సౌకర్యాలతో కూడిన గేట్‌లను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భూమిరెడ్డి సుబ్బరాయుడు, మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అంకాలుగారి బుజ్జి(సర్వేయర్), డా.సుబ్బరాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అల్లాడుపల్లెలో సచివాలయం ప్రారంభం

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె గ్రామంలో రూ.4 0లక్షలతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయ భవనాన్ని బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గోసుల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభించారు. గ్రామ సచివాలయం ద్వారా ప్రజలకు గ్రామాల్లోనే అన్న రకాలైన ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. అల్లాడుపల్లె పంచాయతీ ప్రజలకు సచివాలయ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్షుమయ్య, తహసీల్దారు సుభానీ, ఇన్‌చార్జి ఎంపీడీఓ రాధాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు గోసుల సుధాకర్‌రెడ్డి, సీపీ సుబ్బారెడ్డి, శాంతరాజు, నాగిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, పల్లవోలు రమణయ్య, ప్రసాద్, శ్రీను, వెంకట్‌రెడ్డి, కేతవరం చంద్ర తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

■ మండలంలోని అల్లాడుపల్లెలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని బుధవారం ప్రారంభించిన ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామీణ ఉపాధి హామీ పథకం వ్యవసాయానికి అనుసంధానం చేస్తే కూలీలతో పాటు రైతులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు.అధికారంలో ఉన్న రోజుల్లో చంద్రబాబు నాయుడు ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపారని.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి హామీని నేరవేర్చారన్నారు. టీడీ బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాలు ప్రజాదరణ పొందలేదని.. ఇప్పుడేమో నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రకు కూడా నాలుగు రోజులకు ప్రజాదరణ కరువైందని, తమ వలంటీర్లతో నడుస్తోందన్నారు.

నేడు వెల్లాలలో దేవత ప్రవచనాలు

రాజుపాళెం : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వాముల ఆలయాల్లోని ధ్యాన మందిరంలో గురువారం సాయంత్రం పురాణ దేవతా విజ్ఞాన ప్రవచనాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కానాల విజయలక్ష్మి, ఈఓ నరసయ్య బుధవారం తెలిపారు. నైమిషారణ్య పీఠం అధిపతి హిందూ ధార్మిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి ప్రవచనాలు చేస్తారని వివరించారు. ఆయా గ్రామాల నుంచి ప్రజలు, మహిళలు పాల్గొనాలని వారు కోరారు.

ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలి

ప్రొద్దుటూరు : ప్రభుత్వం పేదల ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. మండలంలోని పెన్నానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ధనిరెడ్డి శివారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్మాణ ఖర్చులు పెరుగుతున్న దశలో 0.75 సెంటు స్థలంలో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ లెక్కల ప్రకారమే రూ.5లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. ఈ విషయమై ఈనెల 6న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతున్నామని, ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గృహాల లబ్ధిదారులు తరలి రావాలని ఆయన కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి షరీఫ్, హరి, శ్రీను, యేసోబ్, ప్రమీల, సుజాత, చంద్రశేఖర్, నారాయణ మూర్తి, ప్రతాప్ పాల్గొన్నారు.

ఇంటింటికి సంక్షేమం.. అర్హతే ప్రామాణికం

గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కాశినాయన : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఇంటింటికి సంక్షేమ పథకాలు అందాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నరసాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడిచిన మూడున్నర సంవత్సరాల పాలనలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఏ మేరకు లబ్ధి చేకూరిందో ఇంటింటికి వివరిస్తూ బుక్‌లెట్‌లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అర్హత ఉండి పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు రాని వారు ఎవరైనా ఉన్నారా అని ఎమ్మెల్యే ఆరా తీశారు. అనంతరం నరసాపురం జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదిత్యరెడ్డి, రమణారెడ్డి, హనుమంతరెడ్డి, రామసుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, పీరావలీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో సంతోషం..

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో గడప గడపలో సంతోషాలు వెల్లువిరుస్తున్నాయని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 5, 6 వార్డులలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. పథకాలను వివరిస్తూ.. లబ్ధిని తెలియజేస్తూ.. సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపారు. సచివాలయం, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు పారదర్శకతను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మరోసారి ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో సగర, ఉప్పర కార్పొరేషన్ చైర్‌పర్సన్ గానుగపెంట రమణమ్మ, బంగారుశీనయ్య, యద్దారెడ్డి, సింగసాని శివయ్య ఉన్నారు.



కాశినాయన: నరసాపురంలో లబ్ధిదారుకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

జగనన్న సైన్యంలా పనిచేయాలి

- సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు దశ, దిశ నిర్దేశం
- ఎమ్మెల్యే రాచమల్లు

రాజుపాళెం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల్లో నియమితులైన సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు జగనన్న సైన్యంలా పనిచేయాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రాజుపాళెంలోని టీటీడీ కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం పార్టీ మండల కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డి అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లకు, గృహసారధులకు, వలంటీర్లకు అవగాహన సమన్వయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. అందుకు సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు వలంటీర్లతో కలిసి పని చేయాలన్నారు. గత ప్రభుత్వంలో ప్రజల కిచ్చిన హామీలను ఎండగడుతూ జగనన్న పాలనలో జరిగిన మేలును ప్రజలకు తెలపాలని సూచించారు. అందుకు మీరంతా కలిసి జగనన్న కుటుంబంలా పని చేయాలని చెప్పారు. ఐ ప్యాక్ టీం సభ్యుడు వారికి అవగాహన కల్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ రాయలసీమ పట్టుభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూల రవీంద్రనాథరెడ్డిని గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు. మండల వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం జగనన్న కిట్లను ఆయా గ్రామాల కన్వీనర్లకు ఎమ్మెల్యే అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు జీరెడ్డి అంజనీకుమారి, ఎంపీపీ సలోమి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ వెలవలి రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ఇంటింటికీ నవరత్నాలు

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇంటింటికీ నవరత్నాల పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని అమృతానగర్‌లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలను మంజూరు చేసిందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యాంగా ఉండాలని ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, సాంకేతిక సమస్యలుంటే వాటిని పరిష్కరించి పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. కొన్ని చోట్ల ప్రజలు వీధి లైట్లు వెలగడం లేదని, పారిశుధ్య సిబ్బంది రావడం లేదని ఫిర్యాదు చేశారు. సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి రాజారాంరెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ డిష్ శ్రీను, వార్డు మెంబర్లు అరుణకుమారి హనుమాన్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, మోషా సుమలత, స్వాతి, బీబీచాన్, తిరుపాల్‌రెడ్డి ఉన్నారు.



సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే

డ్రిప్ పరికరాలపై అవగాహన సదస్సు

బ్రహ్మంగారిమఠం : రైతులు సాగు చేస్తున్న పంటలకు ప్రభుత్వం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందిస్తోందని పోరుమామిళ్ళ వ్యవసా సహాయ సంచాలకుడు మురళీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ వ్యవసాయ ఉద్యాన సహాయకుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏపీఎంఐపీ నియమావళి ప్రకారం 5 ఎకరాలు లోపు పొలం ఉన్న చిన్న సన్న కారురైతులకు 90 శాతం రాయితీపై రూ. 2.18లక్షల వరుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. 5 ఎకరాలు పైబడిన వారికి 70 శాతం రాయితీతో రూ 3.46లక్షల వరుకు బిందు సేద్య పరికరాలు పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి శ్రీనివాసులరెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్, గ్రామ వ్యవసాయ సహాయకులు, డ్రిప్ కంపెనీ ప్రతి నిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకుడు మురళీధర్‌రెడ్డి

సూక్ష్మ సాగునీటి పథకంపై అవగాహన

మైదుకూరు(చాపాడు) : మైదుకూరు పట్టణంలోని స్త్రీ శక్తి భవనం వద్ద బుధవారం సూక్ష్మ సాగునీటి పథకం అమలుపై రైతు భరోసా కేంద్రాలకు చెందిన విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎంఐపీ ప్రాజెక్టు జిల్లా డైరెక్టర్ మురళీమోహన్‌రెడ్డి డ్రిప్ పరికరాల మంజూరు, వాటి పనితీరు, వ్యవసాయ సాగు విధానంపై రైతులకు తెలియజేసేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రొద్దుటూరు క్రైం : అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆర్ట్స్‌కాలేజి రోడ్డులో మద్యం విక్రయిస్తున్నారని బుధవారం సాయంత్రం సమాచారం రావడంతో వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి, సిబ్బంది దాడులు చేయగా సయ్యద్ ఖదీర్, వెల్లాల రమేష్, షేక్ హుస్సేన్‌బాషా , షేక్ సాధక్‌వలీ, కరిముల్లాలను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 33 మద్యం సీసాలతోపాటు వీరు మట్కా రాస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. రూ.5660 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండుకు పంపించినట్లు సీఐ తెలిపారు.

చిరుధాన్యాల సాగు రైతుకు లాభదాయకం

గోపవరం : చిరుధాన్యాల సాగు రైతుకు లాభదాయకమని మండల ప్రత్యేకాధికారి, బద్వేలు ఏడీఏ ఎం .నాగరాజు పేర్కొన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా బుధవారం మండలంలోని బేతాయపల్లెలో చిరుధాన్యాల పంటల సాగు, వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామూలు ఆహార ధాన్యాల కన్నా చిరుధాన్యాలలో అత్యధిక పోషకాలు ఉంటాయన్నారు. చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వం సబ్సిడీ కింద విత్తనాలు అందజేస్తుందన్నారు. అంతకుముందు గ్రామంలో చిరుధాన్యాల సాగు, వాటి ఉపయోగాలపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ అరవిందనాయక్, ఎంపీడీఓ హరినారాయణ, మార్కెట్‌యార్డు డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దారులు



తహసీల్దారు బి.అనురాధ



తహసీల్దారు రవిశంకర్

మైదుకూరు(చాపాడు) : మైదుకూరు మండల తహసీల్దారు గా బి.అనురాధ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న వై.మధు సూదన్‌రెడ్డి బద్వేలు ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ కాగా, వల్లూరు మండలంలోని పని చేస్తున్న తహసీల్దారు బి.అనురాధా మైదుకూరు మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ.. మండలంలోని రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

కలసపాడు తహసీల్దారుగా రవిశంకర్

కలసపాడు : మండల తహసీల్దారుగా జి.రవిశంకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పెద్దముడియం మండల డిప్యూటీ తహసీల్దారుగా పనిచేస్తూ పదోన్నతిపై కలసపాడు మండల తహసీల్దారుగా రవిశంకర్ నియమితులయ్యారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేస్తున్న రమేష్ రెడ్డి పదోన్నతిపై పీబీసీ సబ్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

గోపవరం తహసీల్దారుగా దామోదర్‌రెడ్డి

గోపవరం : మండల తహసీల్దారుగా దామోదర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం తహసీల్దారుగా పనిచేస్తున్న జీవన్‌చంద్రశేఖర్ బద్వేలు ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మైలవరం తహసీల్దారుగా పనిచేస్తున్న దామోదర్‌రెడ్డి ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో తన బాధ్యతలు నిర్వర్తిస్తానని తెలిపారు.

గడువులోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

గోపవరం : గడువులోపు జగనన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజు తెలిపారు. బుధవారం సాయంత్రం మండల అభివృద్ధి కార్యాలయంలో అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మార్చి 22వ తేదీలోపు ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు లబ్ధిదారులతో మాట్లాడుతూ పనులను వేగవంతం చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం నుండి ఎప్పటికప్పుడు నిధులు మంజూరవుతున్నాయని, ఈ విషయాన్ని లబ్ధిదారులకు వివరించాలన్నారు. అన్నిశాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది సమన్వయంతో సకాలంలో ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించిన పనులు పూర్తి కావాలని, వచ్చిన స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ హరినారాయణ, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు సచివాలయ కన్వీనర్ల, గృహ సారథులకు శిక్షణ

ప్రొద్దుటూరు : స్థానిక కొత్తపల్లె బైపాస్ రోడ్డులోని శ్రీదేవి ఫంక్షన్ హాల్‌లో గురువారం ఉదయం 9 గంటలకు ప్రొద్దుటూరు మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు శిక్షణాతరగతులు నిర్వహించనున్నట్లు మండల,గ్రామ సచివాలయాల ఇన్‌చార్జికల్లూరు నాగేంద్ర రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

నేడు అమృతానగర్–2లో గడపగడపకు మన ప్రభుత్వం

మండలంలోని కొత్తపల్లె పంచాయతీ అమృతానగర్–2లో మడూరు రోడ్డులోని 8వ వీధి నుంచి గురువారం ఉదయం 7.30 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

దేశాన్ని అప్పుల్లో ముంచిన మోదీ

బద్వేలు అర్బన్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశాన్ని అప్పుల్లో ముంచి దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టారని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగాగౌతమ్ పేర్కొన్నారు. కాంగ్రెస్‌పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర ముగిసిన సందర్భంగా బుధవారం చేపట్టిన చేయి చేయి కలుపుదాం కార్యక్రమం పోస్టర్లను బద్వేలులోని ఆ పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం తన 8 ఏళ్ళ పాలనలో రూ.109 లక్షల కోట్లు అప్పులు చేసి దేశాన్ని సర్వనాశనం చేసిందన్నారు. మోదీ పాలనలో అచ్చే దిన్ బదులు సచ్చే దినాలు దాపురించాయని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మకాలకు పెట్టిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. దేశ ప్రజలు రాహుల్‌గాంధీ ప్రధానిగా చూడాలన్న ఆశతో ఎదురు చూస్తున్నారని అభిప్రాయపడ్డారు. మరోవైపు పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతుల వ్యతిరేక బడ్జెట్‌గా ఉందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పి.ఎం.కమలమ్మ, పీసీసీ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్, పీసీసీ జనరల్ సెక్రటరీ నజీర్‌అహ్మద్, సత్తార్, బండిజకరయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి కమల్‌ప్రభాస్ తదితరులున్నారు.

నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడిగా భైరవుడు

చాపాడు : మైదుకూరు నియోజకవర్గం బీసీ సంఘం అధ్యక్షుడిగా చాపాడు మండలం గుంత చీపాడుకు చెందిన బత్తల భైరవుడును ఎన్నుకున్నారు. మండలంలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానం సన్నిధిలో బుధవారం బీసీ సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు బత్తల లింగమూర్తి జిల్లా మహిళా అధ్యక్షురాలు వల్లూరు నారాయణమ్మ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా బత్తల భైరవుడు, గౌరవాధ్యక్షుడిగా రాముడు, మహిళా అధ్యక్షురాలుగా రామలక్షుమ్మ, ఉపాధ్యక్షురాలిగా కత్తి నాగులు, కార్యవర్గ సభ్యులుగా మార్కెండేయ, పద్మావతి, గోర్ల రమణయ్య, గోర్ల లక్షుమయ్య, దస్తగిరి, హుస్సేన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీకి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రాజెక్టు ఇన్‌చార్జి సీడీపీఓ లక్ష్మీదేవి బుధవారం కోరారు. పోరుమామిళ్ల–6, కొట్టాపల్లి, కొత్రపాటిపల్లె కేంద్రాల్లో ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పెద్దకప్పలపల్లెలో టీచర్ పోస్టుకు ఓసీ అభ్యర్థి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ప్రాజెక్టు పరిధిలోని కాశినాయన మండలం బసనపల్లె కేంద్రంలో టీచర్ పోస్టుకు, కోడిగుడ్లపాడులో ఆయా పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 6వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తులు ఇవ్వాలన్నారు.

ఘనంగా జ్ఞానానంద గిరి స్వామి జన్మదిన వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక తొగటవీరక్షత్రియ కల్యాణ మండపంలో బుధవారం కల్యాణ కమిటీ ఆధ్వర్యంలో తొగటవీరక్షత్రియ కులగురువు, దొడ్డబల్లాపూర్ కూష్మాండ మహర్షి ఆశ్రమ పీఠాధిపతి దివ్యజ్ఞానానంద గిరి స్వామి జన్మదిన వేడుకలను నిర్వహించారు. చౌడేశ్వరిదేవి అమ్మవారికి, పీఠాధిపతి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

Karur Vysya Bank కరూర్ వైశ్యా బ్యాంక్
డివిజనల్ కార్యాలయం, డోర్ నెం.6-8-1250, మొదటి అంతస్తు, ప్రియ టవర్స్, ఎన్జీవోస్ కాలనీ, కె.టి.రోడ్డు, అన్నారావు సర్కిల్ దగ్గర, తిరుపతి - 517501
స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 (రూలు 8(1)) ప్రకారం జారీచేయబడినది
... 2.06-10-2022 తేదీ గల డిమాండ్ నోటీసు జారీ చేసినారు.
ఋణగ్రహీత : శ్రీమతి కోట సుధామణి, భర్త : శ్రీ కోట రాఘవేంద్ర, 24/101-ఎ, పవర్ హౌస్ రోడ్, ప్రొద్దుటూరు-516360, సహ-ఋణగ్రహీత : శ్రీ కోట రాఘవేంద్ర, తండ్రి : శ్రీ కోట కృష్ణమూర్తి, 34/101-ఎ, పవర్ హౌస్ రోడ్, ప్రొద్దుటూరు-516360.
... రూ.10,67,499.47 పై. ...
... రూ.10,29,509.02 పై. ...
షెడ్యూలు-ఎ : స్థిరాస్తి వివరములు
... 2208/2016, తేది.26.04.2016 ప్రకారం శ్రీమతి కోట సుధామణి ...
ప్రదేశం : ప్రొద్దుటూరు
తేది : 30.01.2023
సం/- అధీకృత అధికారి
ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్